# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 11-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ వెల్లడించారు.

2. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

3. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే 11లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

4. ఢిల్లీలోని ఎర్రకోట పేలుళ్ల ఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భద్రతా చర్యలను చేపట్టాలని హోంమంత్రి వి.అనిత అధికారులను అప్రమత్తం చేశారు.

5. మొంథా తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు బాపట్ల జిల్లాలో కేంద్ర బృందం ఈరోజు పర్యటిస్తోంది.

===========================

జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ తెలిపారు. గుంటూరు పర్యటనలో భాగంగా నగరపరిధిలోని వెంగళాయపాలెంలో ఆధునికీకరించిన చెరువును ఈరోజు ప్రారంభించారు. అలాగే జాతీయ వాటర్ షెడ్ మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా చెరువులు వంటి జలవనరులను పునరుద్ధరిస్తున్నామన్నారు. తద్వారా నీటి సంరక్షణ సాధ్యమవుతుందని, రైతుల పంటల సాగుకు దోహదపడుతుందని మంత్రి పేర్కొంటూ..

వాయిస్..31 సెకన్లు

---------------------------

ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలలోని 50 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు– ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి దృశ్యమాధ్యమం విధానంలో ఈరోజు ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు చేశారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు రెండో దశలో భాగంగా 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను

ప్రారంభించిన ముఖ్యమంత్రి, 587 ఎకరాల్లో మరో 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్..32 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలో ఈ నెల 14-15 తేదీల్లో జరగనున్న భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. రహదారుల అభివృద్ధి, తీరప్రాంత సుందరీకరణ, కొత్త పనులు అన్నీ వేగంగా జరుగుతున్నాయని ఈ మేరకు సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా స్పందించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 37 ప్లీనరీ సమావేశాలు జరుగుతాయని, వీటిలో 5 కంట్రీ సెషన్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు దేశాల్లో వాణిజ్యానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారని, అలాగే వివిధ విభాగాలకు సంబంధించి 410 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకోనుందని నారా లోకేష్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16నెలల్లోనే 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తిరుపతిలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు వంటివి ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలను గొప్ప నగరాలుగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ఢిల్లీలోని ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో నిన్న జరిగిన పేలుళ్ల ఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భద్రతా చర్యలను చేపట్టాలని హోంమంత్రి వి.అనిత అధికారులను అప్రమత్తం చేశారు. హోంమంత్రి ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు అన్ని జిల్లాలలోని వాణిజ్య దుకాణాలు, హోటల్స్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి జనసమ్మర్దం ఉండే ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద వ్యక్తులు గానీ, వస్తువులు గానీ కనిపిస్తే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా చీరాల రైల్వే స్టేషన్లలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ధాన్యం సేకరణలో డ్రయ్యర్లు కలిగిన మిల్లులకే ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన నిన్న సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, నిల్వ గోదాముల వద్ద

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

-----------------------------

రాష్ట్రంలో 750 కోట్ల రూపాయలతో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'అపెక్స్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి' సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సంస్థ ఏర్పాటుకు 40 ఎకరాల స్థలం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం లేఖ రాసిందని తెలిపారు. 450 పడకలతో ప్రకృతి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. ఈ సంస్థలో తొలి ఏడాదిలో వంద యూజీ సీట్లు, పీజీలో 20 సీట్ల చొప్పున భర్తీ జరుగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

-----------------------------

మొంథా తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు బాపట్ల జిల్లాలో కేంద్ర బృందం ఈ రోజు పర్యటిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని చీరాల, వేటపాలెం, కారంచేడు ప్రాంతాలలో కేంద్ర బృంద సభ్యులు పి.పౌసుమి బసు, మహేష్ కుమార్, శశాంక్ శేఖర్ రాయ్, సాయి భగీరథ్‌లు పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని వారికి వివరించారు. అంతకు ముందు జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో పలు చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని, అలాగే కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్ 18 సెకన్లు

=====================